https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

7 AM TO 10 AM

సంపుటి: 01 | సంచిక:29 | పేజీలు :02 | వేల:2/రూ | ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు | సోమవారం, సెప్టెంబర్ 14,2026

## రాష్ట్రంలో సమృద్ధిగా

# వర్షాలు కురవాలి

### పాడిపంటలు పుష్కలంగా పండాలి: -మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 14:**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారిక నివాసంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సతీ సమేతంగా కుటుంబ సభ్యులతో కలిసి గణనాథుడిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, విఘ్నాలను తొలగించి, విజయాలను ప్రసాదించే గణనాథుడి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండి రైతులకు మేలు జరగాలని, పాడిపంటలు పుష్కలంగా పండాలని, రైతులు సంతోషంగా ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజాపాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి అవరోధాలు లేకుండా నిరంతరాయంగా కొనసాగాలని, రాష్ట్ర అభివృద్ధికి ఎదురయ్యే విఘ్నాలన్నీ తొలగిపోయి తెలంగాణ మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని గణనాథుడిని వేడుకున్నట్లు మంత్రి తెలిపారు. వినాయక చవితి పర్వదినాన్ని రాష్ట్ర ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి, పర్యావరణహితమైన వినాయక చవితిని జరుపుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

# బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఉత్కంఠ..

## మంత్రి సోదరుడిపై రాంరెడ్డి విజయం



తెలంగాణ బార్ కౌన్సిల్ నూతన చైర్మన్‌గా సాముల రాంరెడ్డి ఎన్నిక

మంత్రి పొన్నం సోదరుడిపై ఒక్క ఓటు తేడాతో ఉత్కంఠ విజయం

వైస్ చైర్మన్‌గా చలకాని వెంకట్ యాదవ్ గెలుపు

బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా జి. కిరణ్ కుమార్

ఓటు హక్కు వినియోగించుకున్న 26 మంది బార్ కౌన్సిల్ సభ్యులు

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు14**

తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ నూతన చైర్మన్‌గా సాముల రాంరెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం హైకోర్టు ప్రాంగణంలోని బార్ కౌన్సిల్ కార్యాలయంలో నిర్వహించిన ఈ ఎన్నిక ఉత్కంఠభరితంగా సాగింది. చైర్మన్ పదవికి జరిగిన పోటీలో సాముల రాంరెడ్డికి 12 ఓట్లు రాగా, ఆయన సమీప ప్రత్యర్థి, మంత్రి పొన్నం ప్రభాకర్ సోదరుడు పొన్నం అశోక్ గౌడ్‌కు 11 ఓట్లు లభించాయి. దీంతో కేవలం ఒక ఓటు స్వల్ప తేడాతో రాంరెడ్డి విజయం సాధించారు. ఇదే పదవికి పోటీ చేసిన టి.హనుమంత్ రెడ్డికి 3 ఓట్లు దక్కాయి.వైస్ చైర్మన్‌గా చలకాని వెంకట్ యాదవ్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) సభ్యుడిగా జి.కిరణ్ కుమార్ గెలుపొందారు. వైస్ చైర్మన్ పదవికి జరిగిన ఎన్నికలో వెంకట్ యాదవ్‌కు 13 ఓట్లు రాగా, జాకీర్ హుస్సేన్ జావిద్‌కు 10, గోకుల్ రామారావుకు 3 ఓట్లు వచ్చాయి. ఇక బీసీఐ సభ్యుడి పదవికి జరిగిన పోటీలో జి.కిరణ్ కుమార్ 10 ఓట్లతో విజయం సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదుల ద్వారా ఎన్నికైన 26 మంది బార్ కౌన్సిల్ సభ్యులు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో నూతన కార్యవర్గం కొలువుదీరింది.

## అల్వాల్‌లో దారుణం: ఇంటర్ విద్యార్థినిపై

# 8 మంది అత్యాచారం!



- నెలల తరబడి బాలికపై నిందితుల పైశాచికం
- మత్తుమందు, గంజాయికి బానిస చేసి ఘోరానికి పాల్పడిన నిందితులు
- బాధితురాలు తప్పించుకుని ఇంటికి చేరడంతో వెలుగులోకి దారుణం
- నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు14**

హైదరాబాద్ అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యంత దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. ఓ బాలికపై నెలల తరబడి 8 మంది వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఈ ఘోరం బయటపడగా, పోలీసులు 8 మంది నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఇంటర్ చదువుతోంది. పదో తరగతిలో ఉన్నప్పుడు జెర్రీ వరుణ్ అనే యువకుడితో ఆమెకు పరిచయం ఏర్పడింది.



## సారీ చెప్పలేదని బర్తరఫ్ చేస్తారా..

# బాధ కలిగించింది

### మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు

**వరంగల్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు14**

సారీ చెప్పలేదని మంత్రి పదవి నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేశారని ఆమె భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు పేర్కొన్నారు. 'పదవి ఉంటే ఉంటది పోతే పోతది.. సారీ చెప్పమన్నం. ఎంతకాలం బతికామన్నది కాదు.. ఎలా బతికామన్నదే మాకు ముఖ్యం, ప్రజల గుండెల్లో స్థానం ఉన్నంత వరకు పదవి నుంచి తొలగించే ధైర్యం ఎవరికీ లేదు' అని తేల్చిచెప్పారు.సీఎం రేవంత్‌రెడ్డిపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలతో మొదలైన వివాదం, క్రమశిక్షణా కమిటీ నోటీసులు, ఢిల్లీలో అధిష్ఠానంతో చర్చలు, తదితర పరిణామాల నేపథ్యంలో సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించడంపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆదివారం వరంగల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వరంగల్ తూర్పు నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశానికి మాజీ మంత్రి కొండా సురేఖతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ 'అమ్మా.. ఒక్కమాట చెప్పు.. నువ్వు ఏం చెప్పాల్సిన పనిలేదు. కాగితం మీద సారీ.. అని రాసివ్వు' అంటే 'పదవి ఉంటే ఉంటది.. పోతే పోతది అని సారీ చెప్పలేదు' అని స్పష్టంచేశారు. సురేఖది, తనది ఒకటే మాట అని చెప్పారు.


**పార్టీ మారే ఆలోచన లేదు..**తాను కాంగ్రెస్ పార్టీ మారే ప్రసక్తేలేదని తాజా మాజీ మంత్రి కొండా సురేఖ తేల్చిచెప్పారు. 'మీరెక్కడికీ వెళ్లొద్దు.. పార్టీ మిమ్మల్ని చూసుకుంటుంది. మీకు తగిన స్థానం కల్పిస్తుంది' అని తమకు పైనుంచి ఫోన్లు వస్తున్నాయని చెప్పారు. బీసీలు, మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నది రాహుల్‌గాంధీ ఆలోచన కానీ, దురదృష్టవశాత్తు తానే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయ్యాయని సు రేఖ ఆవేదన వ్యక్తంచేశారు.అంతమాత్రాన బాధపడటం లేదని, అకారణంగా తప్పించడమే బాధ కలిగిస్తున్నదని ఆమె చెప్పారు. ఎవరెన్ని ప్రయత్నా లు చేసినా వచ్చే ఎన్నికల్లో వరంగల్ తూర్పు టికెట్ తనదేనని ధీమా వ్యక్తంచేశారు. త్వరలో కొండా మురళికి మంచి అవకాశం రాబోతున్నదని, అందు కు తమకు సంకేతాలు వచ్చాయని వెల్లడించారు. తాను రాజీనామా చేస్తే పోటీచేయటం కాదు ద మ్ముంటే కార్పొరేటర్‌గా గెలిచి చూపించాలని ఎమ్మె ల్సీ సారయ్యకు సురేఖ సవాల్ విసిరారు.

## శంషాబాద్‌లో ట్రావెల్స్ బస్సు బీభత్సం..

# ఒకరు మృతి, 50 మందికి గాయాలు

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు14**

హైదరాబాద్ శివారు శంషాబాద్‌లోని ట్రావెల్స్ బస్సు బీభత్సం సృష్టించింది. కిషన్‌గూడలోని సెవెన్‌హిల్స్ ప్రైవేటు ట్రావెల్స్ సంస్థకు చెందిన ఓ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి కంటైనర్‌ను తప్పించబోయి.. పక్కనే ఉన్న బాలాజీ భవన్ హోటల్‌లోకి దూసుకెళ్లింది.ఈ ప్రమాదంలో హోటల్‌లో టీ తాగుతున్న వ్యక్తి మృతిచెందాడు. మరో 50 మందికి పైగా గాయపడ్డారు. మృతుడిని కరీంనగర్ వాసి అజ్మల్‌గా గుర్తించారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనలో మూడు కార్లు ధ్వంసమయ్యాయి.



మొదటిపేజీ తరువాయి

# అల్వాల్‌లో దారుణం: ఇంటర్ విద్యార్థినిపై 8 మంది అత్యాచారం!

కొన్ని నెలల క్రితం, ఆ యువకుడు చాక్లెట్‌లో మత్తుమందు కలిపి ఇచ్చి, తన కారులోనే బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో మొదలైన నరకం నెలలపాటు కొనసాగింది.ఆ తర్వాత జెర్రీ వరుణ్ ద్వారా రొమాల వరుణ్ అనే మరో యువకుడు పరిచయమయ్యాడు. అతడు బాలికకు మద్యం, సిగరెట్లు, గంజాయి వంటి మత్తు పదార్థాలు అలవాటు చేసి, కొంపల్లిలోని ఓ ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి ఒడిగట్టాడు. వీరే కాకుండా, డేవిడ్ వరుణ్ అనే ఇంకో వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై, మద్యం తాగించి అసభ్యంగా ప్రవర్తించాడు.కుమార్తె ప్రవర్తనలో మార్పు గమనించిన తండ్రి ఈ నెల 9న ఆమెను మందలించడంతో, బాలిక ఇల్లు వదిలి బొల్లారం రైల్వే స్టేషన్‌కు వెళ్లింది. అక్కడ పరిచయమైన నీరజ్ అనే వ్యక్తి, తన స్నేహితుడు విక్కీని పిలిపించాడు. ఇద్దరూ కలిసి బాలికకు మత్తుమందు ఇచ్చి, వేర్వేరుగా అత్యాచారం చేశారు. అక్కడితో ఆగకుండా, విక్కీ తన మరో స్నేహితుడు నిఖిల్‌తో కలిసి బాలికను దూలపల్లిలోని ఓయో గదికి తీసుకెళ్లాడు. అక్కడ నిఖిల్, అతడి ఇద్దరు స్నేహితులతో కలిసి ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు.ఆ రాత్రి బాధితురాలిని విక్కీ తన ఇంట్లో బంధించాడు. 10వ తేదీన అక్కడి నుంచి తప్పించుకున్న బాలిక మళ్లీ బొల్లారం రైల్వే స్టేషన్‌కు చేరుకోగా.. విక్కీ, అతడి స్నేహితుడు గణేశ్ కలిసి అడ్డుకున్నారు. వారు బాలికను బలవంతంగా మత్తులోకి దించి మేడ్చల్ రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లి, అక్కడ రైలులో మరోసారి అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం మల్కాజిగిరికి చేరుకుని, ధూల్‌పేటకు ఆటోలో వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా బాధితురాలు వారి నుంచి తప్పించుకుని ఇంటికి చేరుకుంది.ఇంటికి వచ్చిన బాలిక, జరిగిన ఘోరాన్ని కుటుంబ సభ్యులకు వివరించడంతో వారు వెంటనే అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# మెట్రో రెండో దశ : అగ్నిపరీక్షకు సిద్ధమైన రేవంత్ సర్కార్!

- 3.25 కి.మీ. మేర అండర్‌గ్రౌండ్, డబుల్ డెక్కర్ నిర్మాణాలు
- వివిధ మార్గాల్లో ఆరు రైల్వే క్రాసింగ్‌లను దాటాల్సిన పరిస్థితి
- పలు కేంద్ర ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు తప్పనిసరి
- మొదటి దశను టేకోవర్ చేశాకే రెండో దశకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

త్రినేత్ న్యూస్, సెప్టెంబరు14

హైదరాబాద్ మహానగర రవాణా వ్యవస్థలో మరో కీలక అధ్యాయానికి తెరలేవనుంది. ప్రతిపాదిత మెట్రో రైలు రెండో దశ విస్తరణ, కేవలం కిలోమీటర్ల పరంగానే కాదు, నిర్మాణపరంగానూ ప్రభుత్వానికి పెద్ద సవాలు విసరనుంది. మొదటి దశతో పోలిస్తే ఇది పూర్తి భిన్నం. భూగర్భ మార్గాలు, డబుల్ డెక్కర్ నిర్మాణాలు, కీలకమైన రైల్వే క్రాసింగ్‌లతో కూడిన ఈ ప్రాజెక్టు, ప్రభుత్వ సమన్వయ సామర్థ్యానికి, ప్రణాళికా నైపుణ్యానికి అగ్నిపరీక్షగా నిలవనుంది.రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. రెండో దశ కింద మొత్తం 123 కిలోమీటర్ల మేర 7 మార్గాల్లో 86 స్టేషన్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది పూర్తయితే నగరంలో మెట్రో స్టేషన్ల సంఖ్య 143కు చేరనుంది. అయితే, ఈ విస్తరణ మార్గం అనుకున్నంత సులభం కాదు.



### నిర్మాణంలోనే సంక్లిష్టత

రెండో దశలో ఎదురయ్యే అతిపెద్ద సవాళ్లలో భూగర్భ, డబుల్ డెక్కర్ నిర్మాణాలు ప్రధానమైనవి.భూగర్భ మార్గం: శంషాబాద్ విమానాశ్రయం వద్ద 1.6 కి.మీ., హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ వద్ద 1.65 కి.మీ. మేర భూగర్భంలో మెట్రో లైన్ నిర్మించాల్సి ఉంటుంది. అత్యంత కీలకమైన ఈ ప్రాంతాల్లో నిర్మాణానికి విమానాశ్రయ, రక్షణ శాఖల నుంచి ప్రత్యేక అనుమతులు సాధించడం అత్యంత కీలకం.డబుల్ డెక్కర్: మియాపూర్-పటాన్‌చెరు మార్గంలో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని మదీనాగూడ-చందానగర్ మధ్య 1.2 కి.మీ. డబుల్ డెక్కర్ నిర్మాణం చేపట్టనున్నారు. కింద ఫ్లైఓవర్, పైన మెట్రో ఉండే ఈ వినూత్న నిర్మాణానికి కేంద్ర రవాణా శాఖ ఆమోదముద్ర తప్పనిసరి.

### రైల్వే లైన్ల రూపంలో మరో గండం

ప్రాజెక్టుకు మరో పెద్ద అవరోధం రైల్వే లైన్లు. ఫలక్‌నుమా, ఆరాంఘర్, శంషాబాద్‌తో పాటు జేబీఎస్-మేడ్చల్ మార్గంలో గుండ్ల పోచంపల్లి, సుచిత్ర, అల్వాల్ వద్ద.. ఇలా మొత్తం ఆరు చోట్ల రైల్వే ట్రాక్‌లను దాటాల్సి ఉంది. దీనికి రైల్వే బోర్డుతో సుదీర్ఘ సంప్రదింపులు, సమన్వయం అవసరం. ఇది ప్రాజెక్టులో జాప్యానికి కారణమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### ముందున్న మార్గం కఠినం

ఇన్ని సవాళ్లను అధిగమించడంతో పాటు, ప్రాజెక్టుకు అవసరమైన నిధుల సమీకరణ కూడా ప్రభుత్వానికి మరో పెద్ద టాస్క్. మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి అధికారికంగా స్వాధీనం చేసుకున్న తర్వాతే రెండో దశకు కేంద్రం నుంచి ఆమోదం, నిధుల లభ్యతపై స్పష్టత వస్తుందని అధికారులు భావిస్తున్నారు. మొత్తమ్మీద, మెట్రో రెండో దశ విస్తరణ ప్రభుత్వ పట్టుదల, ప్రణాళికాబద్ధతకు నిజమైన పరీక్షగా నిలవనుంది.

# ఫుడ్ సేఫ్టీ రూల్స్ మరింత కఠినం

## క్యూర్ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం - త్వరలోనే కొత్త చట్టం అమలు

హైదరాబాద్, త్రినేత్ న్యూస్, సెప్టెంబర్ 14:



తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్లలో ప్రస్తుతం అమలవుతున్న 70 ఏళ్ల నాటి మున్సిపల్ యాక్ట్ 1959కు స్వస్తి పలికి, సరికొత్త 'క్యూర్' చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చేందుకు రంగం సిద్ధమైంది. పాత చట్టం స్థానంలో సర్కారు అమలు చేయాలనుకున్న క్యూర్ బిల్లుకు శనివారం అసెంబ్లీ కూడా ఆమోదం తెలిపింది. ఈ కొత్త చట్టం పాత చట్టాన్ని పూర్తిగా భిన్నంగా ఉండనుంది. సర్కారు నియమించిన బాసులమని అధికారులు, ప్రజలచే ఎన్నకోబడిన ప్రజాప్రతినిధుల మంటూ అతిగా వ్యవహారించే వారిపై కఠిన చర్యలు అమలుకానున్నాయి. ఏడు దశాబ్దాల క్రితం సుమారు 10 నుంచి 15 లక్షల జనాభాకు సరిపోయే విధంగా రూపకల్పన చేసిన మున్సిపల్ యాక్ట్ లోని నిబంధనలు నేడు క్యూర్లో పెరిగిన కోటి 30 లక్షల జనాభాకు సరిపోకపోవటంతోనే కొత్త చట్టాన్ని తీసుకురావాలన్న సర్కార్ నిర్ణయించింది. గతేడాది నవంబర్ 25న కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని 27 పట్టణ స్థానిక సంస్థలను జీహెచ్‌ఎంసీలోకి విలీనం చేయాలని సర్కారు జారీ చేసిన ఆదేశాల మేరకు అతి వేగంగా విలీనం. ఆ తర్వాత ఫిబ్రవరి 11 నుంచి మూడు కార్పొరేషన్లుగా పునర్విభజించిన సంగతి తెలిసిందే.

### ఇక కట్టుదిట్టం..

పాత జీహెచ్‌ఎంసీతో పాటు కొత్తగా ఏర్ప డిన సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లకు త్వరలోనే ఎన్నికలు నిర్వ హించి, అందుబాటులోకి రానున్న పాలక మండలి, అధికారగణం మొత్తం కూడా ఈ చట్టం నిబంధనలకు అనుగుణంగా పనిచేయ నున్నాయి. పరిపాలనలో పారదర్శకత, జవాబు దారితనం పెరగడంతో పాటు ఖర్చు చేసే ప్రతి పైసా కూడా లెక్క కట్టేందుకు వీలుగా కొత్త చట్టంలో నిబం ధనలను రూపకల్పన చేసినట్లు తెలిసింది. పౌర, అత్యవసర సేవల్లో భాగంగా పారి శుద్ధ్యం, హెల్త్, డిజాస్టర్ మేనేజ్మెంట్, ఫుడ్ సేఫ్ట్ పక్కాగా అమలు చేసేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. మూడు మున్సిపల్ కార్పొరేషన్ల ఆధీనంలో ఉన్న ఫుడ్ సేఫ్టీ వింగు ఇటీవలే ఏర్పాటు చేసిన టీజీ సేఫ్ విలీనం చేసిన విషయం విదితమే. ఇప్పటి వరకు అడపాదడపా దాడులు చేస్తూ నామ మాత్రంగా అమలైన ఫుడ్ సేఫ్టీ నిబంధనలు ఇక ముమ్మందు పోలీస్ బాసుల ఆధ్వర్యంలో కట్టుదిట్టంగా అమలయ్యే అవకాశాలున్నాయి. ఇందుకు గాను జీహెచ్‌ఎంసీ పరిధిలో ఫుడ్ సేఫ్టీ విధులు నిర్వహిస్తున్న 18 మంది ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు, ఐదుగురు ఫుడ్ సేఫ్టీ డి జిగ్నేటెడ్ ఆఫీసర్లు, మరొకరు ఫుడ్ సేఫ్టీ ఆఫీ సర్లను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ జీహెచ్‌ఎంసీ నుంచి ఇప్పటికే రిలీవ్ చేసినట్లు సమాచారం.ఫుడ్ సేఫ్టీపై స్పెషల్ ఫోకస్ పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే టీజీ సేఫ్ ఏర్పాటు చేసి, తొలుత నాలుగు జిల్లాలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి పరిధిలోని క్యూర్ అర్బన్ రీజియన్ పరిధిలో కొత్త చట్టంలోని నిబంధనలను అమలు చేస్తూ ఫుడ్ సేఫ్టీపై టీజీ సేఫ్ పై పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని సర్కారు భావిస్తున్నది. ఇకపై ముక్కు సూటిగా వ్యవహారించే ఐపీఎస్ ఆఫీసర్ నేతృత్వంలో క్యూర్ సిటీ పరిధిలో ఫుడ్ సేఫ్టీ నిబంధనలు క్యూర్ చట్టానికి అనుగుణంగా అమలు చేసేందుకు దాదాపు రంగం సిద్ధమైందని చెప్పవచ్చు. ముఖ్యంగా మాంసాహార విక్రయ కేంద్రాలైన హోటల్స్, మెస్ ల పై కొరడా ఝుళిపించేందుకు టీజీ సేఫ్ కూడా షెడ్యూల్ సిద్ధం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటి వరకు కొన్ని కేటగిరీలకు చెందిన ఆహార విక్రయ కేంద్రాలు మాత్రమే మున్సిపల్ కమిషనర్ తనిఖీ చేసే పవర్ ఉండేది. ప్రస్తుతం ట్రేడ్ లైసెన్స్తో పాటు ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లు తప్పనిసరి అయ్యాయి. కానీ, సరికొత్త క్యూర్ చట్టం ప్రకారం ప్రతి ఒక ఆహార విక్రయ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ తనిఖీ చేసి, ట్రేడ్, ఫుడ్ సేఫ్టీ లైసెన్సుల్లో ఏ ఒక్కటి లేకపోయినా, సదరు సంస్థను కమిషనర్ పర్మినెంట్గా సీజ్ చేసేలా క్యూర్ సిటీ చట్టంలో విస్తృత అధికారాలు కేటాయించడం గమనార్హం.

# ఇందిరమ్మ ఇళ్లు: ఈ వారంలోనే లబ్ధిదారులకు కేటాయింపు పత్రాలు

- ఇప్పటికే 5,521 మందిని అర్హులుగా గుర్తించిన హౌసింగ్ బోర్డు
- మధ్యవర్తులను నమ్మి డబ్బులు ఇవ్వొద్దని లబ్ధిదారులకు గట్టి హెచ్చరిక
- కేటాయింపు పత్రంతో పాటే చెల్లింపుల వివరాలు, బ్యాంకు ఖాతా అందజేత
- ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ
- విడతల వారీగా లబ్దిదారుడు చెల్లించాల్సింది రూ.6 లక్షలు


త్రినేత్ న్యూస్, సెప్టెంబరు14

హైదరాబాద్‌లోని ఇందిరమ్మ టవర్స్ పథకం కింద ఎంపికైన ఎల్ఐజీ (తక్కువ ఆదాయ వర్గం) లబ్ధిదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ వారంలోనే వారికి ఫ్లాట్ల కేటాయింపు పత్రాలను అందజేయనున్నట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, కమిషనర్ వి.పి. గౌతమ్ ఆదివారం ప్రకటించారు. అర్హత పొందిన లబ్ధిదారులకు అధికారిక కేటాయింపు పత్రంతో పాటు, మొదటి విడత చెల్లించాల్సిన మొత్తం, గడువు, అధికారిక బ్యాంకు ఖాతా వివరాలు అందిస్తామని తెలిపారు.లక్కీ డ్రా ద్వారా ఎంపికైన మొత్తం 7,340 మందిలో ఇప్పటివరకు సుమారు 6,660 మందికి క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేశామని గౌతమ్ వివరించారు. వీరిలో 5,521 మందిని అర్హులుగా నిర్ధారించామని, మిగిలిన వారి పరిశీలన కూడా ఈ వారంలోనే ముగుస్తుందని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే అర్హులందరికీ పత్రాలు జారీ చేస్తారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆయన కీలక సూచనలు చేశారు. చెల్లింపులు కేవలం ప్రభుత్వం నిర్దేశించిన అధికారిక ఖాతాలో మాత్రమే చేయాలని, మధ్యవర్తులు, బ్రోకర్లను నమ్మి వారికి నగదు లేదా కమీషన్ రూపంలో డబ్బులు ఇవ్వొద్దని హెచ్చరించారు. ఎంపిక కాని వారికి రూ.10,000 ఈఎండీ రీఫండ్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని గుర్తుచేశారు.హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లోపల 'క్యూర్' పరిధిలోని 16 నియోజకవర్గాల్లో ఈ ఇళ్లను నిర్మిస్తున్నారు. ఒక్కో ఫ్లాట్‌పై ప్రభుత్వం రూ. 5 లక్షల సబ్సిడీ అందిస్తుండగా, లబ్ధిదారులు రూ. 6 లక్షలు విడతలవారీగా చెల్లించాల్సి ఉంటుంది. పూర్తి సమాచారం కోసం తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌ను చూడాలని లేదా 040-24603572 నంబరును సంప్రదించాలని అధికారులు సూచించారు.



# నకిలీ మెడికల్ క్లెయిమ్‌లతో అమెరికాలో మోసం.. హైదరాబాద్‌లో నిందితుడు!

- అమెరికాలో రూ. 620 కోట్ల భారీ మెడికేర్ స్కామ్‌కు పాల్పడిన నిందితుడు
- మహమ్మద్ ఖదీర్ ఖాన్ హైదరాబాద్‌లో ఉన్నట్లు అనుమానం
- నకిలీ సంతకాలతో భారీగా నిధులు స్వాహా
- అమెరికా అధికారుల సమాచారంతో రంగంలోకి హైదరాబాద్ పోలీసులు



త్రినేత్ న్యూస్, సెప్టెంబరు14

అమెరికాలో సుమారు రూ. 620 కోట్ల విలువైన భారీ మెడికేర్ కుంభకోణానికి పాల్పడి, మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్న ఓ భారతీయ వ్యక్తి ప్రస్తుతం హైదరాబాద్‌లో తలదాచుకున్నట్లు తెలిసింది. మహమ్మద్ ఖదీర్ ఖాన్ అనే ఈ నిందితుడు నగరంలోనే ఉన్నాడని అమెరికా పోలీసులు హైదరాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన స్థానిక అధికారులు అతడి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.టెక్సాస్‌లోని రిచర్డ్‌సన్‌లో ఖదీర్ ఖాన్ 'అమెరికన్ ప్రీమియర్ ల్యాబ్స్' పేరుతో ఒక జెనెటిక్ టెస్టింగ్ ల్యాబొరేటరీని నిర్వహించేవాడు. 2023 ఆగస్టు నుంచి 2024 అక్టోబర్ మధ్య కాలంలో, అమెరికా ప్రభుత్వ మెడికేర్ పథకం కింద సుమారు 93 మిలియన్ డాలర్ల విలువైన నకిలీ క్లెయిమ్‌లను అతడు సృష్టించాడు. వీటి ద్వారా ప్రభుత్వం నుంచి 65 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 620 కోట్లు) అక్రమంగా పొందినట్లు దర్యాప్తులో తేలింది. వైద్యుల వివరాలు, సంతకాలను ఫోర్జరీ చేసి ఈ భారీ మోసానికి పాల్పడినట్లు అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్, ఎఫ్‌బీఐ, ఆరోగ్య శాఖల సంయుక్త విచారణలో వెల్లడైంది.ఈ కుంభకోణం బయటపడటంతో అధికారులు ఖాన్ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసి, అతడిని 'మోస్ట్ వాంటెడ్ ఫ్యుజిటివ్'గా ప్రకటించారు. అయితే, అప్పటికే అతను అమెరికా నుంచి పరారయ్యాడు. ప్రస్తుతం ఖాన్ హైదరాబాద్‌లోనే ఉన్నట్లు పక్కా సమాచారం అందడంతో, శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన ప్రయాణికుల జాబితాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. నిందితుడిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నగరవ్యాప్తంగా గాలిస్తున్నారు.

edited, Printed, Published and Owned by: Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136